సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

మంగళవారం । 1 । అక్టోబర్ । 2024



చీనీ టన్ను రూ.18 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.18 వేలు పలికాయి.



టమాట కిలో రూ.48

కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.48 పలికింది. కనిష్టం రూ.30, సరాసరి రూ.38 ప్రకారం అమ్మకాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
36.3°/22.9°

జిల్లాలో సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

అర్జీదారులకు న్యాయం చేస్తాం



అర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీలను చట్ట పరిధిలో విచారణ జరిపి అర్జీదారులకు న్యాయం చేస్తామని ఎస్పీ రత్న తెలిపారు. సోమవారం పోలీస్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' నిర్వహించారు. సివిల్, ఆస్తి, కుటుంబ కలహాలు, సైబర్ నేరాలు, తదితర వాటిపై ప్రజల నుంచి 57 ఫిర్యాదులు అందాయి. అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, లీగల్ అడ్వైజర్ సాయినాథ్‌రెడ్డి, డీసీఆర్‌బీ సీఐ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

పల్లెన్నగారిపల్లి పరిసరాల్లో చిరుతల సంచారం



గ్రామ సమీపంలోని గుట్టపై ఉన్న చిరుత

చెన్నేకొత్తపల్లి: పల్లెన్నగారిపల్లి పరిసర ప్రాంతంలో చిరుతలు సంచరిస్తున్నాయి. వారం క్రితం చిన్న చిరుత కనిపించిందని రైతులు తెలిపారు. రెండు రోజుల క్రితం గ్రామ సమీపంలోని పిల్లల గుట్ట వద్ద గుండుపైకి పెద్ద చిరుత చేరుకుందన్నారు. తాము తోట పనిలో నిమగ్నమై ఉండగా ఒక కుక్క వేగంగా తమవద్దకు వచ్చిందన్నారు. ఏం జరిగిందని చుట్టూ చూస్తే చిరుత తరుముతూ రావడాన్ని గమనించి భయాందోళనకు గురయ్యామని చెప్పారు. పొలం పనులు చేసేందుకు వచ్చిన కూలీలు పెద్ద సంఖ్యలో ఉండటంతో చిరుత వెనక్కు వెళ్లిపోయిందన్నారు. ఆహారం కోసం పొలాల వద్దకు వచ్చే నెమళ్లు, కుక్కలు, కోతులను చిరుతలు వేటాడుతున్నట్లు తెలుస్తోందన్నారు. అటవీ అధికారులు స్పందించి చిరుతలను బంధించి ఊరికి దూరంగా తీసుకెళ్లి వదలాలని గ్రామస్తులు కోరుతున్నారు.

3 నుంచి సేవాగఢ్‌లో నవరాత్రి ఉత్సవాలు



పోస్టర్లు విడుదల చేస్తున్న ట్రస్టు సభ్యులు

గుత్తి రూరల్: మండలంలోని సేవాగఢ్‌లో అక్టోబర్ 3 నుంచి మాతా జగదాంబ నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు సంత్ సేవాలాల్ మహారాజ్ ట్రస్టు ఉపాధ్యక్షుడు కేశవనాయక్, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు అశ్వత్థనాయక్ తెలిపారు. సోమవారం సేవాగఢ్‌లోని ట్రస్టు కార్యాలయంలో కార్యక్రమంలో నవరాత్రి ఉత్సవాల పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 9 రోజుల పాటు జరిగే ప్రత్యేక పూజల వివరాలను వెల్లడించారు. ఉత్సవాల్లో మొదటి రోజు బాలా త్రిపుర సుందరిదేవీ అలంకరణలో మాతా జగదాంబ భక్తులకు దర్శనమిస్తారన్నారు. చివరి రోజు రాజరాజేశ్వరి అలంకరణలో కటాక్షిస్తారన్నారు.

ఎక్సైజ్ సీఐల బదిలీ

అనంతపురం: కర్నూలు డివిజన్ పరిధిలో ఎక్సైజ్ సీఐ, ఎస్‌ఐలను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. జిల్లాలో 22 మంది, శ్రీ సత్యసాయి జిల్లాలో 15 మంది ఎస్‌ఐలను బదిలీ చేశారు. ఈ మేరకు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డైరెక్టర్ నిషాంత్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

అనంతపురం జిల్లా పరిధిలో నియమితులైన ఎక్సైజ్ సీఐలు


అనంతపురం	ఎం. సత్యనారాయణ
బుక్కరాయసముద్రం	సి. నాగ సునీత రాణి
గుత్తి	కే. ఉమాదేవి
గుంతకల్లు	ఎం. శివ సాగర్
తాడిపత్రి	జి .నాయుడు
ఉరవకొండ	ఆర్. రవిచంద్ర
కణేకల్లు	ఆర్. ఉమాభాయి
రాయదుర్గం	కే.గణేష్
కళ్యాణదుర్గం	ఎస్ఎండీ హసీనాభాను
కంబదూరు	ఎస్ఎం. రఫీ

శ్రీసత్యసాయి జిల్లా పరిధిలో...

ధర్మవరం	ఎన్. చంద్రమణి
చెన్నేకొత్తపల్లి	ఎం. ఫరూఖ్ అజామ్
పెనుకొండ	జి. సృజన్ బాబు
పుట్టపర్తి	జి. నాగరాజు
కదిరి	యు. వీరారెడ్డి
తనకల్లు	వి. వెంకట లక్ష్మమ్మ
మడకశిర	టి. ప్రసాద్

మూడు ముళ్ల బాల్యం

చిలమత్తూరు మండలానికి చెందిన అమ్మాయికి 14 ఏళ్లకే వివాహం చేశారు. భర్త దినసరి కూలీ. రోజూ మద్యం తాగి రావడం, వంట సరిగా చేయడం లేదనో.. పుట్టింటి నుంచి డబ్బు తీసుకురాలేదనో.. బిడ్డ ఏడుస్తోందనో.. ఇలా రోజూ ఆమెను కొట్టడం..రక రకాలుగా వేధింపులకు గురిచేస్తూనే ఉన్నాడు. పెళ్లయిన ఈ రెండేళ్లలోనే రెండు కాన్పులు. చిన్న వయసులోనే గర్భం దాల్చడంతో తొలి కాన్పులో జన్మించిన పాప అనారోగ్యంతో మరణించింది. రెండో కాన్పులో జన్మించిన పాప ఆరోగ్యం కూడా అంతంత మాత్రమే. ఇలాంటి వారు జిల్లా వ్యాప్తంగా చాలామంది ఉన్నారు.



- జిల్లాలో 9 నెలల్లో 89 బాల్య వివాహాలు
- అంతా 8, 10వ తరగతి లోపు వారే
- చట్టాలున్నా చట్టుబండలే

కదిరి: బడి ఈడు వయసులోనే పెళ్లిళ్లు అవుతున్నాయి. బాల్య వివాహాలతో బాలికల జీవితం ముళ్లబాటగా మారుతోంది. ఆడపిల్లను బాధ్యత, బరువు అని భావిస్తున్న తల్లిదండ్రులు పేదరికం, నిరక్షరాస్యత కారణంగా చదువు పూర్తి కాకుండానే పెళ్లి చేస్తున్నారు. వారికి ఇష్టం లేకపోయినా ఒత్తిడి చేసి మరీ బలవంతంగా పెళ్లి పీటల మీద కూర్చోబెడుతున్నారు. పెళ్లి, సంసారం, జీవితమంటే ఏంటో తెలియని వయసులోనే అమ్మాయిలు బంధాల బాధ్యతల్లో బందీ అవుతున్నారు. ప్రతి నెలా జిల్లాలో సరాసరిన పది బాల్య వివాహాలు జరుగుతున్నాయి. ఈ యేడాది ఇప్పటి వరకూ 89 బాల్య వివాహాలు జరిగినట్లు ఐసీడీఎస్ అధికారుల దృష్టికి వచ్చింది. ఇక వారి దృష్టికి రానివి మరో వంద దాకా ఉంటాయి. ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబర్ 7 దాకా జిల్లాలో 13 ఏళ్ల నుంచి 16 ఏళ్ల మధ్య వయసున్న (ఎనిమిది నుంచి పదో తరగతి చదువుతున్న) అమ్మాయిల్లో 16.4 శాతం మందికి, అబ్బాయిల్లో 2 శాతం మందికి బాల్య వివాహాలు జరిగినట్లు ఓ స్వచ్ఛంద సంస్థ జరిపిన సర్వేలో వెల్లడైంది. ఆ సంస్థ జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీలు, పాఠశాలలు, వివిధ స్వచ్ఛంద సంస్థలు, పలు ప్రభుత్వ విభాగాల నుంచి సమాచారం సేకరించింది.

దుర్భరంగా అమ్మాయిల పరిస్థితి..

బాల్య వివాహాలు చేసుకున్న అమ్మాయిల పరిస్థితి అత్యంత దుర్భరంగా ఉంది. వారు సంసారం, కుటుంబం, పిల్లల బాధ్యత మోస్తూనే మరోవైపు అనారోగ్య సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. తమ ఆరోగ్య సమస్యలపై భర్తతో కూడా చెప్పుకోలేని బాధలను వారు అనుభవిస్తున్నారు. కూలి పనో లేదా ఏదైనా ఉద్యోగమో చేసి డబ్బు సంపాదిస్తున్నప్పటికీ వారు ఇంట్లో వంట పని, ఇంటి పని, కుటుంబ సభ్యులందరికీ సేవలు, చాకిరీ తప్పడం లేదు.

బాల్య వివాహాలకు కారణాలెన్నో..

బాల్య వివాహాలకు ఎన్నో రకాల కారణాలు ఉంటున్నాయి. ఆడపిల్లకు పెళ్లి చేసేస్తే ఇక తమ బాధ్యత తీరిపోతుందని కొందరు.. బాగా డబ్బున్న సంబంధం కుదిరిందని ఇంకొందరు, పెద్దయితే తాము చెప్పిన సంబంధం చేసుకుంటుందో లేదో అనే ఆలోచనతో మరికొందరు, ప్రేమలో పడి తల్లిదండ్రులకు చెడ్డ పేరు తెస్తారనే ఆలోచనతో కొందరు.. ఇలా రకరకాల కారణాలతో ఆడ పిల్లలకు తల్లిదండ్రులు బాల్య వివాహాలు జరిపించేస్తున్నారు.

2024లో జిల్లాలో ఐసీడీఎస్ దృష్టికి వచ్చిన బాల్య వివాహాలు

మాసం	బాల్య వివాహాలు	మే	18
జనవరి	08	జూన్	07
ఫిబ్రవరి	14	జూలై	06
మార్చి	11	ఆగస్టు	09
ఏప్రిల్	16	మొత్తం	89

ఆడపిల్లను కన్నా వేధింపులే..

మనకు స్వాతంత్య్రం సిద్ధించి 77 ఏళ్లు పూర్తయినా ఇంకా జనంలో మూఢ నమ్మకాలు పోలేదు. ఇప్పటికీ ఆడబిడ్డను కన్న మహిళకు వేధింపులు తప్పడం లేదు. ప్రసవించి రెండు నెలలు కూడా నిండకనే ఆ తల్లిని కూలి పనులకు పంపుతున్నారు. కుటుంబంలో వంశోద్ధారకుడు జన్మించే వరకూ కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించేది లేదు.. అనే మాటలు ఇప్పటికీ ఎన్నో ఇళ్లలో వినపడుతున్నాయి. పేదలే కాదు..బాగా డబ్బున్న ఇళ్లలో కూడా మగ బిడ్డ ఉంటేనే అని అంటున్నారు.

కమిటీలెన్ని ఉన్నా..ప్రయోజనం సున్నా..

బాల్య వివాహాల నిరోధక చట్టం– 2006కు సంబంధించి నిబంధనలను మరింత కఠినతరం చేస్తూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2012 మార్చి 19న జీఓ ఎంఎస్ నం.13ను విడుదల చేసింది. బాల్య వివాహాలను నివారించి, ప్రజల్ని చైతన్యం చేసేందుకు జిల్లా, డివిజన్, మండల, గ్రామ స్థాయి కమిటీలను ఏర్పాటు చేయాలని ఆ జీఓలో స్పష్టంగా ఉంది. జిల్లా స్థాయిలో కలెక్టర్ చైర్మన్‌గా, ఎస్పీ, ఐసీడీఎస్ పీడీ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కన్వీనర్లుగా ఉన్నారు. డివిజన్ స్థాయిలో చైర్మన్‌గా ఆర్డీఓ, కన్వీనర్లుగా డీఎస్పీ, సీడీపీఓ, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి ఉన్నారు. మండల స్థాయిలో తహసీల్దార్ చైర్మన్‌గా, ఎంపీడీఓ, ఎస్ఐ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు కన్వీనర్లుగా ఉంటున్నారు. గ్రామ స్థాయిలో సర్పంచ్ చైర్మన్‌గా, అంగన్‌వాడీ కార్యకర్త కన్వీనర్‌గా, పంచాయతీ కార్యదర్శి, పాఠశాల హెచ్ఎం, ఏఎన్ఎం, మహిళా వార్డు మెంబర్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి, మహిళా సంఘ సభ్యురాలు ఉంటున్నారు. ఇన్ని కమిటీలు ఉన్నప్పటికీ జిల్లాలో బాల్య వివాహాలు ఆగడం లేదు. ప్రభుత్వం దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని మేధావి వర్గం సూచిస్తోంది.

ఆరోగ్యకరం కాదు



అమ్మాయిలకు 18 ఏళ్లు నిండకనే పెళ్లి చేయడం ఆరోగ్యకరం కాదు. శారీరకంగానే కాకుండా మానసికంగా కూడా అంతగా ఎదిగి ఉండరు. చిన్న వయసులో గర్భం దాలిస్తే బిడ్డతో పాటు తల్లికి కూడా ప్రమాదమే. బాల్య వివాహాలతో ఎన్నో అనర్థాలున్నాయి. బాల్య వివాహాలు వద్దు.. అని ఒక అధికారిగానే కాకుండా ఒక మహిళగా కూడా సలహా ఇస్తున్నాను.

– పి.ఎస్.మంజువాణి, డీఎంహెచ్ఓ, పుట్టపర్తి

అవగాహన కల్పిస్తున్నాం



బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై ప్రతి గ్రామంలో అవగాహన కల్పిస్తున్నాం. కౌన్సెలింగ్ కూడా ఇస్తున్నాం. బాల్య వివాహం జరుగుతున్నట్లు మా దృష్టికి రాగానే స్థానిక పోలీసుల సహకారంతో వెంటనే అక్కడికి వెళ్లి ఆపేస్తున్నాం. బాధిత అమ్మాయిలను వారి అభిరుచి మేరకు షెల్టర్‌హోమ్స్, కేజీబీవీలు, సోషల్ వెల్ఫేర్ స్కూల్స్, సర్వీస్ హోంలకు పంపుతున్నాం.

– నాగ మల్లేశ్వరి, ఐసీడీఎస్ పీడీ, పుట్టపర్తి

వివాహాలు చేస్తే కఠిన చర్యలు



బాల్య వివాహాల నిషేధ చట్టం ప్రకారం ఆడపిల్లకు 18, మగ వారికి 21 సంవత్సరాలు నిండిన తర్వాతే పెళ్లిళ్లు చేయాలి. అప్పుడే వారికి శారీరక, మానసిక పరిపక్వత వస్తుంది. బాల్య వివాహం జరిపించిన తల్లిదండ్రులు, సంరక్షకులు, పురోహితులు, స్నేహితులు, అనుమతించిన పెద్దలు, సహకరించిన వారు కూడా నేరస్తులే అవుతారు. వీరికి రెండేళ్ల జైలుశిక్షతో పాటు రూ.లక్ష వరకు జరిమానా విధిస్తారు.

– రత్న, ఎస్పీ

ప్లంబర్ల ఇళ్ల నిర్మాణాల కూల్చివేత





ప్లంబర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేంద్ర, హిటాచీతో పునాదులు, షెడ్లు కూలుస్తున్న దృశ్యం

- బీజేపీ నేతల నిర్వాకం
- గొడవకు దిగిన బాధితులు
- వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

ధర్మవరం అర్బన్: ప్లంబర్లు చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను బీజేపీ నాయకులు సోమవారం కూల్చివేయించారు. బాధితులు న్యాయం కోసం పోలీసులను ఆశ్రయించారు. బాధితులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని సర్వేనంబర్ 650–2లో 76 మంది ప్లంబర్లకు ఇళ్ల స్థలాలు కేటాయించారు. అయితే ఈ స్థలం తమకు చెందినదని కొంతమంది కోర్టుకెళ్లారు. దీంతో 15 ఏళ్లుగా కోర్టులో వివాదం నడిచింది. ఎట్టకేలకు గత ఏడాది ప్లంబర్లకు అనుకూలంగా కోర్టు తీర్పు వచ్చింది. దీంతో పలువురు ఇళ్ల నిర్మాణాల కోసం పునాదులు తీయించారు. మరికొందరు పిల్లర్లు వేశారు. ఇంకొందరు షెడ్లు నిర్మించుకున్నారు. ఈ క్రమంలో సోమవారం బీజేపీ నాయకులు హిటాచీ వాహనంతో వచ్చి కూల్చివేయించారు. విషయం తెలుసుకున్న బాధిత ప్లంబర్లు అక్కడకు చేరుకుని నాయకులతో గొడవకు దిగారు. ఎంతో కష్టపడి కట్టుకుంటున్న ఇళ్లను మీరెలా కూలుస్తారంటూ నిలదీశారు. దీంతో ఇరువర్గాల నడుమ తోపులాట జరిగింది. సమాచారం అందుకున్న వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ సంఘటన స్థలానికి చేరుకుని ఇరువర్గాల వారినీ స్టేషన్‌కు తరలించారు. ప్లంబర్ల అసోసియేషన్ అధ్యక్షుడు సురేంద్ర మాట్లాడుతూ ఇటీవల బీజేపీ నాయకులు గొడుగు నాగరాజు, సోమశేఖర్, బాలకృష్ణయాదవ్ ప్లంబర్ల వద్దకు వచ్చి రూ.50 లక్షల నగదుతో పాటు 15 ప్లాట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారన్నారు. ఇందుకు ప్లంబర్లు ఒప్పుకోకపోవడంతో కక్ష కట్టి పునాదులు, సిమెంట్ పిల్లర్లు, రేకుల షెడ్లను కూల్చివేయించారని, దాదాపు రూ.15 లక్షల వరకు నష్టం వాటిల్లిందని పోలీసులకు తెలిపారు. తమకు న్యాయం చేయాలని, దౌర్జన్యానికి పాల్పడిన బీజేపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని సీఐకి ఫిర్యాదు చేశారు. పట్టణంలోని ప్లంబర్లలో కొందరికే ప్లాట్లు కేటాయించారని, ఇంకా చాలామంది అర్హులకు అందకపోవడంతో వారు తమను సంప్రదించారని, వారి తరఫున తాము అండగా నిలిచామని బీజేపీ నాయకుడు గొడుగు నాగరాజు చెబుతున్నారు. కొంతమంది ఒకటికి మించి ప్లాట్లు తీసుకున్నారని, వాటిని రద్దు చేసి అర్హులైన వారికి కేటాయించాలని కోరారు. రెవెన్యూ అధికారులు స్పష్టత ఇచ్చే వరకు స్థలాల్లోకి ప్రవేశించడం.. కట్టడాల కూల్చివేతకు పాల్పడటం వంటివి చేయరాదని బీజేపీ నాయకులకు సీఐ హెచ్చరించారు.

వెయిట్‌లిఫ్టింగ్ యోగా విభాగంలో మంజమ్మకు కాంస్యం



కాంస్యం సాధించిన పోలీస్ మంజమ్మ

హిందూపురం: ఆలిండియా పోలీస్ వెయిట్ లిఫ్టింగ్ యోగా విభాగంలో హిందూపురం అప్‌గ్రేడ్ మహిళా పోలీస్ మంజమ్మ కాంస్యం సాధించింది. వివిధ విభాగాల్లో ఏపీ పోలీస్ శాఖకు 19 పతకాలు వచ్చాయి. ఆంధ్రప్రదేశ్ పోలీస్ స్పోర్ట్స్ ఆఫీసర్ రేణుకాభిరెడ్డి నేతృత్వంలో విజయవంతంగా పోటీలు ముగించుకొని సోమవారం రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావును మంగళగిరి కార్యాలయంలో పోలీస్ క్రీడాకారులు కలిశారు. ఈ సందర్భంగా స్పోర్ట్స్ ఐజీలు మోహనరావు, శ్రీకాంత్ అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. కాంస్య పతకం సాధించిన మహిళా కానిస్టేబుల్ మంజమ్మకు ఎస్పీ రత్న ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. అలాగే హిందూపురం డీఎస్పీ కె.వి.మహేష్, తదితరులు అభినందనలు తెలిపారు.

టీచరు దివాకర్‌నాయుడిపై సస్పెన్షన్ వేటు

అనంతపురం ఎడ్యుకేషన్: చిట్టీల పేరుతో రూ.కోట్లకు కుచ్చుటోపీ పెట్టి కటకటాల పాలైన అనంతపురంలోని రాజేంద్ర నగరపాలక ఉన్నత పాఠశాల తెలుగు టీచరు కాకర్ల దివాకర్ నాయుడుపై సస్పెన్షన్ వేటు పడింది. మూడు నెలల క్రితం అజ్ఞాతంలోకి వెళ్లిన దివాకర్‌నాయుడు ఇటీవల కోర్టులో లొంగిపోవడంతో జడ్జి ఆదేశాల మేరకు పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ప్రస్తుతం ఆయన రెడ్డిపల్లి సబ్‌జైలులో ఉన్నాడు. రిమాండ్ రిపోర్ట్ విద్యాశాఖకు అందింది. ఈ క్రమంలో మూడు రోజుల కిందట షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఇంటి తలుపునకు అతికించారు. సోమవారం సస్పెన్షన్ ఉత్తర్వులను జిల్లా విద్యాశాఖ అధికారి బి.వరలక్ష్మి జారీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడుకు అందజేశారు. దివాకర్‌నాయుడు ఇంటి వద్ద ఈ ఉత్తర్వులను అతికించనున్నారు.

గడువులోగా వినతులు పరిష్కరించండి

- అధికారులకు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఆదేశం



అర్జీలు స్వీకరిస్తున్న జేసీ అభిషేక్ కుమార్

ప్రశాంతి నిలయం: ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన వినతులను అధికారులు గడువులోగా పరిష్కరించి ప్రజలకు సత్వర న్యాయం చేయాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' నిర్వహించారు. జాయింట్ కలెక్టర్‌తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ పింఛన్లు, భూ సమస్యలు, రస్తా సమస్యలు, రేషన్ కార్డులు తదితర సమస్యలపై ప్రజల నుంచి 247 వినతులు స్వీకరించారు. జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ మాట్లాడుతూ దినపత్రికలలో వచ్చే వార్తలపై ఎప్పటికప్పుడు స్పందించి రీ జాయిండర్లు పంపాలన్నారు. ప్రజల అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. మంగళవారం ఉదయాన్నే ఇంటింటికీ వెళ్లి పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలన్నారు. ఎటువంటి లోటుపాట్లు లేకుండా మండల ప్రత్యేక అధికారులు, డీఆర్‌డీఏ అధికారులు పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించాలన్నారు. ఎట్టి పరిస్థితులల్లోనూ పింఛన్లను పెండింగ్‌లో పెట్టరాదని, అర్హులైన అందరికీ పంపిణీ చేయలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ కొండయ్య, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ అధికారి శివారెడ్డి, డ్వామా పీడీ విజయప్రసాద్, పట్టు పరిశ్రమ శాఖ జేడీ పద్మావతి, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, ఉద్యానవన శాఖ జిల్లా అధికారి చంద్రశేఖర్, డీఎంహెచ్ఓ డాక్టర్ మంజువాణి, ఐసీడీఎస్ పీడీ నాగమల్లేశ్వరి వివిద శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

న్యాయం చేయలేదని ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన దస్తగిరి

ప్రశాంతి నిలయం: పుట్టపర్తి రూరల్ మండలం నిడిమామిడి గ్రామానికి చెందిన దూదేకుల దస్తగిరి సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక సమీపంలోని పోలీస్ చెకింగ్ పాయింట్ వద్ద ఆత్మహత్యాయత్నం చేశాడు. ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకునేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు అడ్డుకుని విచారణ చేపట్టారు. సర్వే నంబర్ 428–2లోని మూడు సెంట్ల స్థలాన్ని పూర్వం నుంచి అనుభవిస్తున్నామని, అయితే ఐదేళ్ల క్రితం తన సోదరులు మాబు, బాబు దౌర్జన్యంగా ఆ స్థలం ఆక్రమించి, ఇల్లు కట్టుకోవడానికి రాళ్లు తోలారని దస్తగిరి తెలిపాడు. అప్పటి నుంచి రూరల్ పోలీస్ స్టేషన్, రెవెన్యూ కార్యాలయంలో పలు మార్లు ఫిర్యాదు చేశానని, చివరకు అమరావతికి వెళ్లి ముఖ్యమంత్రి చంద్రబాబు కార్యాలయంలో వినతిపత్రం అందజేసినా ఎటువంటి న్యాయమూ జరగలేదన్నాడు. అందుకే తాను మనస్తాపం చెంది ఆత్మహత్యాయత్నం చేశానని చెప్పాడు. ఈ విషయమై రెవెన్యూ అధికారులను వివరణ కోరగా.. సదరు మూడు సెంట్ల స్థలం వంకపోరంబోకు అయినందున ఇంటి స్థలం పట్టా ఇవ్వడానికి వీలు లేదని తెలిపారు. ఈ స్థల వివాదం కోర్టులోనూ నడుస్తోందన్నారు. అనంతరం దస్తగిరి ఆత్మహత్యాయత్నం చేసిన ప్రాంతాన్ని ఎస్పీ రత్న పరిశీలించారు. ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సందర్భంగా చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లపై జాయింట్ కలెక్టర్‌తో చర్చించారు.

పోషణ్ అభియాన్ విస్తృతం చేయండి




జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రశాంతి నిలయం: జిల్లా వ్యాప్తంగా పోషణ్ అభియాన్ కార్యక్రమాలు విస్తృతం చేయాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణలో పోషకాహార మాసోత్సవాల ముగింపు ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఐసీడీఎస్, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఎనుములపల్లి గణేష్ సర్కిల్ వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ,ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 1 నుంచి 30 వరకు రాష్ట్రీయ పోషణ్ అభియాన్ మాసోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరిశుభ్రత పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఆకుకూరలు మనిషికి బలాన్ని ఇస్తాయని, సంపూర్ణ ఆరోగ్యం పొందాలంటే ఇవి ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ నాగమల్లేశ్వరి, డీఎంహెచ్ఓ డాక్టర్ మంజువాణి, డీసీహెచ్ఎస్ డాక్టర్ తిప్పేంద్ర నాయక్, డీపీసీ సుదేశ్ వర్మ, డీపీఎ అశోక్ కుమార్, డీసీపీఓ మహేష్, పీఓ మురళి, పీఓ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలపై మరో పిడుగు

- విత్తన పప్పుశనగ రాయితీకి కత్తెర వేసిన కూటమి సర్కారు
- ఏకంగా 25 శాతానికి కుదింపు
- రైతులకు క్వింటాపై గతేడాది కన్నా రూ.2,370 భారం



అనంతపురం అగ్రికల్చర్: అన్నదాతలపై మరో పిడుగు పడింది. ఇప్పటికే పెట్టుబడి సాయం అటకెక్కించడంతో పాటు గతేడాదికి సంబంధించి ఉచిత పంటల బీమా కింద రావాల్సిన పరిహారంపై కూడా నోరు మెదపని కూటమి సర్కారు.. విత్తన పప్పుశనగపై అందించే రాయితీని తాజాగా కుదించేసింది. గతేడాది, ఈ ఏడాది కరువు పరిస్థితుల కారణంగా ఇబ్బంది పడుతున్న తరుణంలో సబ్సిడీ పెంచి విత్తన పప్పుశనగ అందాల్సింది పోయి సబ్సిడీ కుదించడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పప్పుశనగపై 25 శాతం రాయితీ..

రబీలో పప్పుశెనగ సాగు చేసే రైతులకు రాయితీతో విత్తనం పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయశాఖ ప్రకటించింది. అందుకోసం జిల్లాకు జేజీ–11 రకం పప్పుశనగ విత్తనం 27,139 క్వింటాళ్లు కేటాయిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. అలాగే శ్రీ సత్యసాయి జిల్లాకు 1,143 క్వింటాళ్లు విత్తనం కేటాయించారు. అయితే రాయితీ మాత్రం 25 శాతం మాత్రమేనని ప్రకటించారు. క్వింటా పూర్తి ధర రూ.9,400 కాగా అందులో 25 శాతం రాయితీ రూ.2,350 పోనూ క్వింటాకు రూ.7,050 ప్రకారం రైతులు చెల్లించాల్సి ఉంటుంది. ఒక్కో రైతుకు గరిష్టంగా 200 కిలోలు అంటే 2 క్వింటాళ్లు పంపిణీ చేయనున్నారు. ఒక ఎకరా ఉన్న రైతులకు 10 కిలోలు కలిగిన ప్యాకెట్లు రెండు, రెండు ఎకరాలకు నాలుగు ప్యాకెట్లు, మూడు ఎకరాలకు ఆరు ప్యాకెట్లు, నాలుగు ఎకరాలకు 8 ప్యాకెట్లు, ఐదు ఎకరాలు అంతకన్నా ఎక్కువగా ఉన్న రైతులకు 10 ప్యాకెట్లు పంపిణీ చేయాలని నిర్ణయించారు.

గతేడాది 40 శాతం రాయితీ..

గత రబీలో అప్పటి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్ద పీట వేసింది. ఏటా క్రమం తప్పకుండా రైతు భరోసా–పీఎం కిసాన్ అందిస్తూనే.... జూలై నెలలోపే ఉచిత పంటల బీమా కింద పెద్ద ఎత్తున పరిహారం కూడా అందించింది. అలాగే రబీలో విత్తన పప్పుశనగపై గతేడాది 40 శాతం రాయితీ అందించింది. క్వింటా రూ.8,100 కాగా అందులో 40 శాతం రూ.3,240 పోనూ రైతుల వాటా కింద రూ.4,680 ప్రకారం కట్టించుకున్నారు.

క్లుప్తంగా

రూ. 2.28 లక్షల విలువైన టపాసుల స్వాధీనం



నిందితుడిని అరెస్ట్ చూపుతున్న పోలీసులు

తనకల్లు: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా నిల్వ ఉంచిన బాణాసంచాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం ఉదయం కొక్కంటి క్రాస్‌లో నివాసముంటున్న రాజు ఇంటిలో పోలీసులు సోదాలు చేపట్టారు. ఆ సమయంలో రూ.2.28 లక్షల విలువ చేసే టపాసులను గుర్తించి స్వాధీనం చేసుకుని, నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ గోపి తెలిపారు.

యువకుడి బలవన్మరణం



మృతుడు వెంకటరమణ నాయక్

తనకల్లు: మండలంలోని భీమ్లానాయక్‌తండాకు చెందిన నాను నాయక్ కుమారుడు వెంకటరమణ నాయక్ (23) ఆత్మహత్య చేసుకున్నాడు. వ్యసనాలకు బానిసైన వెంకటరమణ నాయక్... ఇటీవల తల్లిదండ్రులు కొనిచ్చిన సెల్‌ఫోన్‌ను తాకట్టు పెట్టి డబ్బు తీసుకుని తన జల్సాలు తీర్చుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు మందలించడంతో సోమవారం ఉదయం ఇంట్లో ఉన్న క్రిమి సంహారక మందు తాగాడు. విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు వెంటనే 108 అంబులెన్స్ ద్వారా కదిరి ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. చికిత్సకు స్పందించక అనంతపురం జీజీహెచ్‌లో వెంకటరమణ నాయక్ మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ గోపి తెలిపారు.

జిల్లాస్పత్రిలో ముదిరిన వైద్యుల వివాదం

- సూపరింటెండెంట్‌కు వ్యతిరేకంగా సీనియర్ వైద్యుల ఫిర్యాదులు
- మూకుమ్మడిగా సెలవులో వెళ్తామంటూ లీకులు



హిందూపురం జిల్లా ప్రభుత్వాస్పత్రి

హిందూపురం టౌన్: జిల్లాస్పత్రి వైద్యుల వివాదం ఉన్నతాధికారులకు తలనొప్పిగా మారింది. రోజు రోజుకూ వైద్యుల మధ్య వివాదం ముదిరి రచ్చకెక్కడంతో గ్రూపు రాజకీయాలు ఊపందుకున్నాయి. ఈ క్రమంలో ఒకరిపై మరొకరులు ఫిర్యాదులు చేసుకుంటూ జిల్లాస్పత్రి ప్రతిష్టను మంటగలుపుతున్నారు. వైద్యసేవల్లో జిల్లాలోనే హిందూపురం ప్రభుత్వాసుపత్రికి ప్రత్యేక గుర్తింపు ఉంది.

రచ్చకెక్కుతున్న వివాదం..

జిల్లాస్పత్రిలో సీనియర్ వైద్యులను కాదని జూనియర్ డాక్టర్ రోహిల్ కుమార్‌ను సూపరింటెండెంట్‌గా వైద్య శాఖ ఉన్నతాధికారులు నియమించారు. దీంతో వైద్యుల మధ్య ఉన్న వివాదానికి ఆజ్యం పోసినట్టైంది. తమ కంటే జూనియర్ అయిన డాక్టర్‌కు సూపరింటెండెంట్‌గా బాధ్యతలు ఎలా అప్పగిస్తారంటూ ఇప్పటికే సీనియర్ వైద్యులు పలుమార్లు వైద్య శాఖ ఉన్నతాధికారులతో మొరపెట్టుకున్నారు. దీనికి తోడు డాక్టర్ రోహిల్ కుమార్ తీరు కొంత మంది వైద్యులకు నచ్చకపోవడం కూడా వైద్యుల మధ్య వివాదానికి కారణమైంది. ఈ నేపథ్యంలో సూపరింటెండెంట్ వైఖరిని ఎండగడుతూ పలువురు సీనియర్ వైద్యులు వైద్యవిధాన పరిషత్ కమిషనర్‌కు లేఖలు రాశారు. ఆయన సూపరింటెండెంట్ హోదాకు పనికి రాడంటూ ప్రజాప్రతినిధులకు, వైద్యశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు.

సెలవులో వెళ్తామంటూ లీకులు..

జిల్లాస్పత్రిలో సూపరింటెండెంట్, సీనియర్ వైద్యుల మధ్య సాగుతున్న కోల్డ్‌వార్ మరింత ముదిరి చివరకు సెలవు పెట్టి వెళ్లిపోయే స్థితికి చేరుకుంది. ఇప్పటికే ఆస్పత్రిలో ఓ వైద్యుడు సూపరింటెండెంట్ తీరు నచ్చక, సెలవులో వెళ్లిపోయారు. మరికొంత మంది వైద్యులు కూడా ఆయన బాటలోనే సెలవుపై వెళ్లేందుకు సిద్ధమవుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో వివాదం మరింత ముదిరే అవకాశాలు ఉన్నాయని ఆస్పత్రి వర్గాలు బహిరంగంగా చర్చించుకుంటున్నాయి.

వైద్య సేవలపై ప్రభావం..

హిందూపురంలోని జిల్లాస్పత్రికి హిందూపురం పరిసర ప్రాంతాలతో పాటు చుట్టు పక్కల మండలాల నుంచి రోజూ పెద్ద సంఖ్యలో రోగులు వస్తుంటారు. ఈ క్రమంలో రోజు వారీ ఓపీ 800 నుంచి 900ల దాకా నమోదవుతోంది. ఇన్ పేషంట్స్ 150 మంది ఉంటున్నారు. దీంతో పాటు గైనిక్ విభాగంలో ప్రతి నెలా 400ల మంది అడ్మిషన్‌లో ఉంటున్నారు. దాదాపు 200 నుంచి 220 వరకూ ప్రసవాలు జరుగుతుంటాయి. మొత్తం 45 మంది వైద్యులు రోగులకు వైద్య సేవలందిస్తున్నారు. ఆస్పత్రిలో ప్రస్తుతం ఓపీ సేవలు సాయంత్రం 4గంటల వరకు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం ఆస్పత్రిలో చోటు చేసుకున్న పరిణామాలు.. రోగులకు అందే వైద్యసేవలపై తీవ్ర ప్రభావం చూపనున్నాయి. ఇదే అంశంపై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రోహిల్‌కుమార్ మాట్లాడుతూ.. ఆస్పత్రిలో రోగులకు వైద్యసేవలు అందించడంలో ఎలాంటి ఇబ్బందులు లేవన్నారు. సీనియర్ వైద్యులను సమన్వయం చేసుకుని ముందుకు సాగుతున్నామన్నారు.

పౌర హక్కుల రక్షణకు కృషి చేయండి : ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ రత్న

గోరంట్ల: భారత రాజ్యాంగం కల్పించిన పౌరహక్కుల పరిరక్షణకు కృషి చేయాలని ఎస్పీ రత్న పిలుపునిచ్చారు. గోరంట్ల మండలం వానవోలులో సోమవారం సాయంత్రం నిర్వహించిన పౌర హక్కుల దినోత్సవానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. పౌరులు జీవించడానికి రాజ్యాంగం అనేక హక్కులు కల్పించిందన్నారు. పౌరహక్కులకు అటంకం కల్పిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించబోమన్నారు. కార్యక్రమంలో సీఐ శేఖర్, తహసీల్దార్ మారుతి, ఎంపీడీఓ రఘునాథగుప్త తదితరులు పాల్గొన్నారు.

పవిత్ర జ్యువెలరీలో చోరీ



చోరీ జరిగిన దుకాణాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఓడీచెరువు: స్థానిక పవిత్ర జ్యువెలరీ దుకాణంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. సోమవారం ఉదయం ఈ విషయాన్ని గుర్తించిన దుకాణ యజమాని శ్రీరామాచారి ఫిర్యాదు మేరకు నల్లమాడ సీఐ నరేంద్రరెడ్డి అక్కడకు చేరుకుని పరిశీలించారు. దాదాపు 20 తులాల బంగారం, కిలో వెండి చోరీకి గురైనట్లు రామాచారి చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

వక్క మార్కెట్‌కు స్థల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న మార్కెటింగ్ శాఖ ఆర్‌జేడీ రామాంజనేయులు

అమరాపురం: మండలంలోని కాచికుంట – ఉదుగూరు గ్రామాల మధ్యలో ఉన్న స్థలాన్ని వక్క మార్కెట్ యార్డు ఏర్పాటుకు మార్కెటింగ్ శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులు సోమవారం సాయంత్రం పరిశీలించారు. అంతకు ముందు వలస, తమ్మడేపల్లి గ్రామాల్లో రైతులు సాగు చేసిన తమలపాకు తోటలను ఆయన పరిశీలించారు. రైతులు మాట్లాడుతూ... వక్క తోటలో అంతర పంటగా తమలపాకు సాగు చేస్తున్నామని, ప్రస్తుతం తమలపాకు ధరలు లేక నష్టాలు చవిచూడాల్సి వస్తోందని వాపోయారు. వక్క తమలపాకు తోటలను ఉపాధి హామి పథకానికి అనుసంధానం చేస్తే కనీసం కూలీల ఖర్చులు మిగులుతాయన్నారు. అనంతరం రైతు ప్రకాష్ ఇంటి వద్ద ఆరబెట్టిన వక్కను, యంత్రాలను పరిశీలించారు. ఈ ప్రాంతంలో వక్క దిగుబడులకు మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో నష్టపోతున్నట్లు రైతులు తెలిపారు. దీంతో ఆయన స్థల పరిశీలన చేసి, ప్రభుత్వానికి నివేదిక పంపనున్నామని, త్వరలో అనుమతులు రాగానే మార్కెట్‌ను అందుబాటులోకి తెస్తామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అగ్రి ట్రేడ్ మార్కెటింగ్ అధికారి నరసింహమూర్తి, మడకశిర మార్కెట్ యార్డు కార్యదర్శి నాగేంద్రకుమార్, రైతులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి మూలవిరాట్ అపహరణ



మూలవిరాట్‌ను పెకలించడంతో బోసిపోయిన గర్భగుడి

పామిడి: స్థానిక పెన్నానదిలో వెలసిన సీతారామలక్ష్మణ సమేత భక్తాంజనేయస్వామి ఆలయంలోని ఆంజనేయస్వామి మూలవిరాట్‌ను దుండగులు అపహరించుకెళ్లారు. ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ ఘటన జరిగినట్లుగా స్థానికులు అనుమానాలు వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం ఆలయంలో పూజలు చేయడానికి వెళ్లిన సమయంలో అర్చకుడు అమరనాథ్ గుర్తించి విషయాన్ని ఆలయ ధర్మకర్తలు ఎ శ్రీనివాసులు, ఎ షణ్ముఖ కుమార్‌కు తెలిపారు. ఈ సందర్భంగా షణ్ముఖ కుమార్ మాట్లాడుతూ.. 1938లో తమ పూర్వీకుడు మోటార్ బాలన్న.. పెన్నానదిలో స్నానం ఆచరిస్తున్న సమయంలో లభించిన సీతారామలక్ష్మణ విగ్రహాలను అక్కడే ప్రతిష్టించి ఓ ఆలయాన్ని నిర్మించారని, దీని ఎదురుగానే మరో ఆలయాన్ని నిర్మించి భక్తాంజనేయస్వామి రాతి విగ్రహాన్ని ప్రతిష్ఠించారని గుర్తు చేశారు. అనంతరం ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

'సుప్రీం' వ్యాఖ్యలతోనైనా బుద్ధి తెచ్చుకో...

- సీఎం చంద్రబాబుకు ఈరలక్కప్ప హితవు

మడకశిర: తిరుమల లడ్డూ విషయంలో సుప్రీం కోర్టు చేసిన వ్యాఖ్యలతోనైనా బుద్ధి తెచ్చుకుని ప్రవర్తన మార్చుకోవాలని సీఎం చంద్రబాబుకు మడకశిర నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప హితవు పలికారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. బాధ్యతాయుతమైన రాజ్యాంగ పదవిలో ఉంటూ వాస్తవాలు తెలుసుకోకుండా తిరుమల పవిత్రతకు భంగం కలిగేలా చంద్రబాబు చేసిన ఆరోపణలను సుప్రీం కోర్టు తప్పుబట్టడాన్ని ఆయన సమర్థించారు. స్వార్థ రాజకీయాలకు దేవదేవుడినే వాడుకున్న చంద్రబాబు శిక్ష అనుభవించక తప్పదన్నారు. అవాస్తవాలతో లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేసిన చంద్రబాబు ఇప్పటికైనా శ్రీవారి భక్తులకు క్షమాపణ చెప్పాలని, లేకుంటే సుప్రీం కోర్టు సంధించిన ప్రశ్నలకు జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు.

సీనియర్ పురుషుల ఫుట్‌బాల్ ప్రాబబుల్స్ ఎంపిక



జిల్లా సీనియర్ పురుషుల జట్టు ప్రాబబుల్స్‌కు ఎంపికైన క్రీడాకారులు

హిందూపురం టౌన్: జిల్లా సీనియర్ పురుషుల ఫుట్‌బాల్ జట్టు ప్రాబబుల్స్‌కు సోమవారం స్థానిక ఎంజీఎం క్రీడా మైదానంలో నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వీరిలో ప్రతిభ కనబరిచిన 30 మందిని ప్రాబబుల్స్‌గా ఎంపిక చేసినట్లు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు జేవీ అనిల్‌కుమార్ తెలిపారు. ఎంపికైన వారిని శిక్షణా శిబిరానికి తరలించి తుది జట్టును ఎంపిక చేసి, రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి మహమ్మద్ సలీమ్, కోశాధికారి శేఖర్, ఉపాధ్యక్షుడు ఇర్షాద్ అలీ, కోచ్‌లు రాఘవేంద్ర, చైతన్య పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి మోడరన్ పెంటాథ్లన్ పోటీలకు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో పాఠశాల హెచ్‌ఎం, సిబ్బంది

పుట్టపర్తి: త్వరలో శ్రీకాకుళంలో జరిగే రాష్ట్ర స్థాయి మోడరన్ పెంటాథ్లన్ పోటీల్లో ప్రాతినిథ్యం వహించే అండర్-17, 19 విభాగంలో క్రీడాకారులను ఎంపిక ప్రక్రియ సోమవారం ముగిసింది. బుక్కపట్నంలోని జెడ్పీహెచ్ఎస్‌లో చేపట్టిన ఈ ప్రక్రియను హెచ్‌ఎం జగదీశ్వర్, పీడీ నాగరాజు పర్యవేక్షించారు. అండర్-17 విభాగంలో ధనుంజయ్, రామచరణ్ తేజ్, అండర్-19 విభాగంలో గోవర్ధన్, మంజునాథ్ ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులను పాఠశాల హెచ్‌ఎం, సిబ్బంది అభినందించారు.

టీడీపీ నేత భూకబ్జా

- న్యాయం చేయాలంటూ రెవెన్యూ అధికారులను ఆశ్రయించిన వృద్ధ దంపతులు

బొమ్మనహాళ్: పట్టాదారు పాసు పుస్తకాలు చేయిస్తానని నమ్మించి రూ.50 వేలు తీసుకోవడంతో పాటు నాలుగు ఎకరాల భూమిని కాజేశారంటూ వృద్ధ దంపతులు వాపోయారు. ఈ మేరకు బొమ్మనహాళ్ డిప్యూటీ తహసీల్దార్ సుజాతను సోమవారం కలసి ఫిర్యాదు చేసి, మాట్లాడారు. బొమ్మనహాళ్ మండలంకృష్ణాపురం గ్రామానికి చెందిన నరసమ్మ, మునలన్న దంపతులు కొన్నేళ్లుగా కొలగానహళ్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 147లో ఆరు ఎకరాల భూమిని సాగు చేసుకుంటున్నారు. ఈ భూమికి సంబంధించి పట్టాదారు పాసు పుస్తకాలు చేయిస్తానంటూ ఏడేళ్ల క్రితం రూ.50 వేలను వరుసకు అల్లుడైన టీడీపీ నాయకుడు ఆంజనేయులు తీసుకున్నాడు. ఈ క్రమంలో వృద్ధులను మోసగిస్తూ నాలుగు ఎకరాలను ఆయన భార్య అచ్చమ్మ పేరుతో పట్టాదారు పాసు పుస్తకాలు చేయించుకుని బ్యాంక్‌లో రుణం కూడా తీసుకున్నాడు. సంవత్సరాలు గడిచినా ఆంజనేయులు పట్టాదారు పాసుపుస్తకాలు చేయించకపోవడంతో ఇటీవల రెవెన్యూ అధికారులను నేరుగా కలసి అడిగారు. ఆ సమయంలో ఆంజనేయులు చేసిన మోసం బయటపడింది. దీనిపై తమకు న్యాయం చేయాలంటూ వృద్ధ దంపతులు సోమవారం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు.

నేటి నుంచి మద్యం దుకాణాలకు దరఖాస్తులు



అనంతపురం: కొత్త మద్యం పాలసీని అనుసరించి ప్రైవేట్ మద్యం షాపుల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య తెలిపారు. అనంతపురం ఎక్సైజ్ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మంగళవారం నుంచి అక్టోబర్ 9వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. జిల్లాలో 136, శ్రీ సత్యసాయి జిల్లాలో 87 ప్రైవేట్ మద్యం షాపులు అందుబాటులోకి రానున్నాయన్నారు. ఆన్‌లైన్ విధానంతో పాటు ఆఫ్‌లైన్‌లోనూ దరఖాస్తులు అందించవచ్చన్నారు. జిల్లాలో 10 ఎక్సైజ్ స్టేషన్లు, శ్రీ సత్యసాయి జిల్లాలో 8 ఎక్సైజ్ స్టేషన్‌లలో దరఖాస్తులు తీసుకుంటామన్నారు. ప్రతి స్టేషన్‌లో ఒక డిజిటల్ టెక్నీషియన్‌ను అందుబాటులోకి తెచ్చామని పేర్కొన్నారు. అక్టోబర్ 11న లాటరీ పద్ధతిలో షాపులను కేటాయిస్తామన్నారు. దరఖాస్తు ఫీజు రూ.2 లక్షలుగా ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. ఈ మొత్తం తిరిగి ఇవ్వరని స్పష్టం చేశారు. లైసెన్స్ ఫీజు ఎంత చెల్లించాలి? ఇతర వివరాలు నోటిఫికేషన్ విడుదల తర్వాత ప్రకటిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్య



నాగేంద్ర (ఫైల్)

చెన్నేకొత్తపల్లి: అప్పుల బాధ తాళలేక ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... చెన్నేకొత్తపల్లి మండలం మేడాపురం గ్రామానికి చెందిన బోయ నాగేంద్ర (43) తనకున్న రెండున్నర ఎకరా పొలంలో వ్యవసాయంతో పాటు కూలి పనులతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో పంటల సాగుకు దాదాపు రూ.3 లక్షల మేర అప్పులు అయ్యాయి. వీటిని ఎలా తీర్చాలో తెలియక మదనపడుతూ ఆదివారం రాత్రి పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ధర్మవరంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం ఆయన మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. కాగా, మృతుడికి భార్య లలిత, ఇద్దరు కుమారులు ఉన్నారు.

వివాహిత అదృశ్యం



కావ్యాంజలి

గార్లదిన్నె: మండలంలోని ముకుందాపురానకి చెందిన వివాహిత కావ్యాంజలి కనిపించడం లేదు. ఈ మేరకు ఎస్‌ఐ గౌస్ మహమ్మద్ బాషా సోమవారం వెల్లడించారు. మల్లమ్మ,, సతీష్ దంపతుల కుమార్తె కావ్యాంజలికి ఏడాది క్రితం కళ్యాణదుర్గానికి చెందిన యువకుడితో వివాహమైంది. మూడు నెలల క్రితం భర్తతో గొడవపడి ఆమె పుట్టింటికి చేరుకుంది. ఈ క్రమంలో తల్లిదండ్రులకు తాను భారం కాకూడదని భావించిన ఆమె అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తూ జీవనం సాగిస్తోంది. ఈ నెల 26న ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగి ఇంటికి చేరుకోలేదు. కుటుంబసభ్యులు గాలించినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై మిస్సింగ్ కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.